
క్లుప్తంగా

గోధుమతాచు హల్‌చల్


మాచవరంలో తాచుపామును పట్టుకుంటున్న వర్మ

అంబాజీపేట: గోధుమ తాచు కొబ్బరి కాయల రాశుల్లోకి వెళ్లి హల్‌చల్ చేస్తూ అక్కడ ఉన్నవారందరినీ భయభ్రాంతులకు గురిచేసింది. మాచవరం అప్పన శ్యామ్ కొబ్బరి గోదాములోకి బుధవారం గోధుమ తాచు చొరబడింది. అక్కడ ఉన్న కొబ్బరి రాశుల్లో కలయదిరుగుతూ హల్‌చల్ చేసి భయభ్రాంతులకు గురిచేసింది. దాంతో స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం అందించారు. పాము ఉన్న ప్రాంతాన్ని వర్మ పరిశీలించి తాచుపామును చాకచక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు. అనంతరం జన సంచారం లేని ప్రాంతంలో పామును విడిచిపెట్టారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యను అభ్యసించాలి


పి.గన్నవరంలో సమావేశంలో మాట్లాడుతున్న సీఐ భీమరాజు

పి.గన్నవరం: నేటి ఆధునిక విద్యా విధానంలో విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యను అభ్యసించాలని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు అన్నారు. స్థానిక గ్రేస్ కళాశాలల ప్రాంగణంలో బుధవారం జరిగిన ఫేర్‌వెల్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కష్టపడి ఇష్టంతో చదివితే మంచి ఉద్యోగాలు వస్తాయని అన్నారు. ఇటీవల వచ్చిన సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. కళాశాల వ్యవస్థాపకులు ఎన్‌ఆర్‌జే ప్రసాద్, శిరీష దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పీవీఆర్ నాయుడు, కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్, ఎండీ నల్లి మనీషా, కందాలపాలెం ఎస్‌జేఎం మినిస్ట్రీస్ అధినేత జి.దానియేలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మామిడికుదురు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నగరం గ్రామానికి చెందిన వానరాశి నరసింహారావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ బుధవారం తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా మద్యం షాపులు సెలవు కావడంతో మంగళవారం మద్యం కొనుగోలు చేసి తన ఇంటి వద్ద అక్రమంగా విక్రయిస్తుండగా అతడ్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రూ.9,780 విలువ చేసే 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మామిడికుదురు: స్థానిక బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో గెయిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొందేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని శిక్షణ కేంద్రం మేనేజర్ సురేష్ బుధవారం తెలిపారు. ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, ఇండస్ట్రియల్ వెల్డర్, ఆటోక్యాడ్, జీడీపీ, కస్టమర్ ఎగ్జిక్యూటివ్ కాల్ సెంటర్ (కంప్యూటర్) కోర్సులకు గెయిల్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివిన విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఇతర వివరాల కోసం 88979 99099, 94925 54969 నంబర్లను సంప్రదించాలని మేనేజర్ సురేష్ సూచించారు.


ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి


పి.గన్నవరం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం, ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల గుర్తింపుపై బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బొండాడ నాగమణి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. డీఎల్‌డీఓ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ భారతి, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎంఈఓలు కోన హెలీనా, వీరభద్రం, నాయకులు సంసాని పెద్దిరాజు, సాదనాల జేడీ, వాసంశెట్టికుమార్, పెచ్చెట్టి ఈశ్వరరావు, ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు, కార్యదర్శి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు సిద్ధం

- నేటి నుంచి దసరా సంబరాలు ప్రారంభం
- ముస్తాబైన ఆలయాలు
- రోజుకో అలంకారంలో అమ్మవార్ల దర్శనం


అంబాజీపేట సంతమార్కెట్‌లో అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న భక్తులు


శరన్నవరాత్ర మహోత్సవాలకు ముస్తాబవుతున్న బి.సావరంలోని దుర్గాదేవి ఆలయ ప్రాంగణం

అంబాజీపేట: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లోనూ అమ్మవారి ఆలయాలను సిద్ధం చేశారు. ఈ నెల 4 నుంచి 12వ తేదీ వరకూ దేవీ శరన్నవరాత్రులు నిర్వహించేందుకు ఆలయాలను సిద్ధం చేస్తున్నారు. కనకదుర్గ అమ్మవారి ఆలయాలకు రంగులు, విద్యుత్ దీపాలంకరణ, చలువ పందిళ్లతో సిద్ధం చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అంబాజీపేట, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, ఇరుసుమండ, ముక్కామల, పసుపల్లి, వక్కలంక, కముజువారిలంక, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మాచవరం, ఇసుకపూడి, చిరతపూడి, నందంపూడి, తొండవరం, వాకలగరువు గ్రామాల్లో ఆలయాల వద్ద సందడి నెలకొంది. స్థానిక సంత మార్కెట్, అంబాజీపేట శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే విజయ బేతాళ ఉత్సవాలకు సంబంధించి మాచవరం దుర్గాక్షేత్రం రామ్‌ఘాట్ నుంచి కలశను మేళతాళాలు, యువకులు కేరింతల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చేందుకు 13 పాలాలకు చెందినవారు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం పెద్ద వీధిలో ఉన్న శ్రీనివాసనగర్‌లో వేంచేసిన బేతాళ స్వామి ఆలయంలో నెలకొల్పనున్నారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు

మామిడికుదురు: శ్రీదేవీ శరన్నవరాత్ర ఉత్సవాల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేశారు. భారీ ఎత్తున పందిళ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మండల కేంద్రం మామిడికుదురు, పెదపట్నంలంక, పాశర్లపూడి, మగటపల్లి, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక, నగరం, పెదపట్నం, మొగలికుదురు, గెద్దాడ, లూటుకుర్రు, ఆదుర్రు, కొమరాడ, మాకనపాలెం, ఈదరాడ, గోగన్నమఠం, కరవాక గ్రామాల్లో శరన్నవరాత్రును ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఆలయాల వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలోని ప్రసిద్ధి చెందిన అమ్మవారి ఆలయాల వద్ద శరన్నవరాత్రులు గురువారం నుంచి ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా మండల కేంద్రం ఆత్రేయపురం కనకమహాలక్ష్మి, మల్లమ్మ అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన లక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని ప్రసిద్ధ వసంతవాడ పార్వతీదేవీ ఆలయం, బాలాత్రిపుర సుందరీ సమేత రాజరాజేశ్వర స్వామి, పులిదిండి, వెలిచేరు, ర్యాలి, వాడపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో నవరాత్రులకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కరుణ పొందాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరుతున్నారు.


మగటపల్లి గాయత్రీ త్రిశక్తి పీఠం

కొత్తపేటలో..

కొత్తపేట: దసరా ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. ప్రధానంగా కొత్తపేట శివారు బొరుసువారిసావరం గ్రామంలో వేంచేసిన విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆలయ పునర్నిర్మాణకర్త బొరుసు వెంకటఉదయ భాస్కర్–వసుధ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పసుపులేటి శ్రీనివాస్ (వాసు) పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు బిక్కవోలు సత్యనారాయణాచార్యులు, వేదపండితుడు బ్రహ్మశ్రీ అనంత లక్ష్మణకుమారాచార్యులు తదితర అర్చక, వేదపండితుల బృందంతో తొలిరోజు అమ్మవారిని రజతకవచాలంకృత దుర్గాదేవిగా అలంకరణతో 10 రోజులు అవతారాల దర్శనంతో పాటు ప్రత్యేక పూజలు, వివిధ హోమాలు, ఒక రోజు చండీ హోమం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీమాతను నిజరూప దర్శనం నుంచి రాజరాజేశ్వరీదేవిగా 10 అవతారాల్లో అమ్మవారి అలంకరణలు, దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వాడపాలెం, ఏనుగులమహల్ ఆలయాల్లోనూ ఆలయ ట్రస్టీ, భక్తుల పర్యవేక్షణలో 10 రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు.


ఆత్రేయపురంలో ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

గాంధీ విగ్రహానికి వినతి పత్రం



మలికిపురంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు


గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

మలికిపురం: స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకులు జీతాల కోసం చేస్తున్న నిరసన దీక్షలు బుధవారం 22వ రోజుకు చేరుకున్నాయి. అధ్యాపకులు యథావిధిగా నిరసన దీక్షను శాంతియుతంగా చేయడంతో పాటు గాంధీ జయంతిని పురస్కరించుకుని గాంధీ విగ్రహం వరకు శాంతియుతంగా ఊరేగింపుగా వెళ్లి గాంధీ విగ్రహానికి తమ వినతి పత్రం అందించారు. యాజమాన్యం ఇప్పటికైనా మొండి వైఖరి విడనాడి తమ సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు సహకరించమని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులు నల్లి మోహన్‌రావు గెద్దం పేర్రాజు, చెవ్వాకుల సూర్యప్రకాశరావు, నాయకులు నల్లి శివకుమార్, రంపాల రాజు, ప్రజా సంఘాల నాయకులు అధ్యాపకులతో సంఘీభావం తెలిపారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సర్వశిక్షాభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులు గాంధేయ మార్గంలో బుధవారం నిరసన తెలిపారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి తమ సమస్యలను ఏకరవు పెట్టారు. 13 ఏళ్ల నుంచి పని చేస్తున్న తమ జీవితాలకు కూటమి ప్రభుత్వంలోనూ విముక్తి కలగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనలో జేఏసీ నాయకులు జి.రామకృష్ణ, మణికుమార్, మెహదీ, ఫణికుమార్, జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు ఘన సన్మానం


కొత్తపేటలో రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: బాలలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడం ద్వారా దేశ భవిష్యత్‌ను నిర్దేశించేది ఉపాధ్యాయులేనని, సమాజంలో ఆ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉన్నతమైనదని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కాంతిభారతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏటా మాదిరిగా గత నెల 5 న నిర్వహించవలసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి (గురుపూజోత్సవం) సందర్భంగా ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయుల సన్మానాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, కాంతిభారతి విద్యా సంస్థల కరస్పాండెంట్ టి.సత్యవాణి ఆధ్వర్యంలో జరిగిన సభకు ఎంఈఓ ఎం.హరిప్రసాద్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే బండారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఆలమూరు ఎంఈఓ పి.షాలెంరాజు, వివిధ జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన భారం వెంకటలక్ష్మి, అంకం శ్రీలక్ష్మి, వి.వెంకటరమణ, ఎంపీవీ సత్యనారాయణ, టి.త్రినాథరావులను ఎమ్మెల్యే సత్యానందరావు చేతుల మీదుగా కిరీటాలు, నూతన వస్త్రాలు, మెమెంటోలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కాంతిభారతి యాజమాన్యం ఎమ్మెల్యే బండారుకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ముందుగా గాంధీ, సర్వేపల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్, ఎంఈఓ 2 కె.లీలావతి, నటరాజ కళాసమితి అధ్యక్షుడు నల్లా సత్యనారాయణమూర్తి, రిటైర్డ్ పీఈటీ మారిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను అన్ని విధాలా ప్రోత్సహించాలి


పలివెలలో కళాకారుల సంఘ భవనం ఆధునీకరణపై చర్చిస్తున్న రాజ్‌కుమార్

కొత్తపేట: కళారూపాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ప్రోత్సహించడం ద్వారా కళాకారుల జీవన స్థితిగతులను మెరుగుపర్చాలని ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్‌వుడయార్ కోరారు. కళాస్రవంతి సంగీత, వాయిద్య, నృత్య కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం బుధవారం సాయంత్రం మండలంలోని పలివెల కళాకారుల సంఘ భవనంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కొమారిపాటి ఏసువెంకటప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షుడు, శిల్పి రాజ్‌కుమార్ వుడయార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, గుర్తింపు కార్డులు, మంజూరు కావలసిన సంక్షేమ పథకాలు, కళాకారుల పింఛన్లు, పేద కళాకళాకారులకు ఇళ్ల మంజూరు, సంఘ బలోపేతం, సంఘ భవనం ఆధునీకరణ తదితర అంశాలపై చర్చించారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ కళాకారులకు సంబంధించి ప్రభుత్వ సాంస్కృతిక శాఖ పరిధిలో పలు సంక్షేమ పథకాలు ఉన్నాయని, వాటిని అర్హులైన వారికి మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. అలాగే శాఖ ద్వారా కళారూపాల ప్రదర్శనలు ఇచ్చి ప్రోత్సహించాలనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. సంఘం ద్వారా పేద కళాకారులకు, వివిధ కారణాలతో మృతి చెందిన కళాకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడంపై అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులను అభినందించారు.

పుష్కరఘాట్ పవిత్రతను కాపాడాలి


తొండవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

అంబాజీపేట: మద్యం, అసాంఘిక కార్యకలాపాలకు నిలయం మారిన పుష్కరఘాట్‌లో తక్షణమే చర్యలు తీసుకుని ఘాట్ పవిత్రతను గ్రామస్తులంతా కాపాడవల్సిన అవసరం ఉందని అమలాపురం రోహిణి ఆస్పత్రి వైద్యుడు వీఎస్ఎస్ మూర్తి అన్నారు. తొండవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు అధ్యక్షతన గ్రామసభను బుధవారం నిర్వహించారు. గ్రామాల్లో చెత్త, చెదారం వేయడం వల్ల వచ్చే రోగాలను వివరించారు. అనంతరం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పుష్కర్ ఘాట్ పవిత్రను కాపాడాలంటూ విద్యార్థులు, గ్రామస్తులు ప్లకార్డులు చేత పట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు, ఎస్ఎంసీ చైర్మన్ పేరాబత్తుల వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా గాంధీ జయంతి

బాపూజీకి నేతల నివాళులు

మామిడికుదురు: దేశ స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ చేసిన పోరాటం అజరామరమని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ప్రస్తుతించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మామిడికుదురులో విగ్రహానికి కూటమి నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీ చేసిన సేవలను కొనియాడారు. అప్పనపల్లి కంకిపాటి సూర్యారావు, ఆదిలక్ష్మి మెమోరియల్ ట్రస్టు ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి ప్రముఖ ఆర్ఎంపీ కంకిపాటి వెంకటేశ్వరరావుతో పాటు స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్, జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు గాంధీ జయంతిలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజు, కొండేటి వెంకటేశ్వరరావు, అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్య ప్రకాశరావు, సుందరనీడి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: గాంధీ ఆశయాలు అనుసరణీయమని, నేటి యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పుల్లేటికుర్రులో నూతనంగా నిర్మించిన మహాత్మా గాంధీ, బస్ షెల్టర్‌లను సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన ఎమ్మెల్యే ప్రారంభించారు. గాంధీ విగ్రహాన్ని గోకవరపు బాబు బహూకరించగా, బస్ షెల్టర్‌ను గ్రామస్తుల సహకారంతో నిర్మించడం అభినందనీయమన్నారు. అనంతరం పుల్లేటికుర్రు శ్రీ బాలగణపతి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వర్ధిని జువెలరీస్ గోకవరపు కృష్ణసాయిబాబు, వారి కుమారుల సహకారంతో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. అలాగే ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కొత్తపేట మండల పరిషత్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

మలికిపురం: గాంధీ ఆచరించిన అహింసా సిద్ధాంతం చాలా గొప్పదని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలో బుధవారం పలు గ్రామాల్లో గాంధీ జయంతి నిర్వహించారు. మలికిపురం కూడలిలో గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్కవరం పంచాయతీ వద్ద జరిగిన గ్రామ సభలో కూడా ఎమ్మెల్యే పాల్గొని పారిశుద్ధ్య కార్మికులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తపేట: గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వాడపాలెం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీకాకోళ్లపు భీమేశ్వరరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యుడు తమ్మన సాయిప్రసాద్, సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘ భవనంలో మహాత్ముని విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ త్సామా బాబు, మాజీ సర్పంచ్ బండారు బులితాత పాల్గొన్నారు. మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి, ప్రాంగణంలో జాతి నేతలకు ఎంపీపీ మార్గన గంగాధరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి, శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేశారు.


అంబాజీపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

పి.గన్నవరం: మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక అక్విడెక్టు పార్కులో వాసవి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాటోలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు.

ఆత్రేయపురం: గాంధీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని ఎంపీడీఓ నాతిబుజ్జి పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆత్రేయపురం మండలంలో వాడవాడలా జయంతి ఘనంగా నిర్వహించారు. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల స్థూపానికి ఆలయ ఈవో నల్లం చక్రధరరావు, ఆలయ అర్చకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గాంధీ జయంతి

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఎంపీపీ వీరా మల్లిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే విద్యాశాఖ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంఈవో–1 డి.కిషోర్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రావులపాలెం: గాంధీ జయంతిని మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు ముగించి పారిశుద్ధ్య కార్మికులకు సన్మానించారు. సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం బాపూజీ జయంతి వేడుకలు జరిగాయి. గాంధీ ఆశయ సాధనకు అందరూ కృషి చేసి, దేశ పటిష్ఠతను మరింత ఇనుమడింప చేయాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు ఘన నివాళులు అర్పించారు.

పాలకవర్గం రద్దు పైనే కోర్టుకెళ్లాం

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ (అంతర్వేది పాలెం ఫిర్కా డెవలప్‌మెంట్ ట్రస్ట్) పాలకవర్గం రద్దు చేయడానికి ఎవరికీ హక్కు లేదని, దానిపైనే తాము కోర్టు నుంచి స్టే పొందామని ట్రస్ట్ పాలకవర్గ కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ట్రస్ట్ కళాశాల కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ నిర్వహణలో ఎటువంటి అక్రమాలు జరగలేదని, దీనిపై రాష్ట్ర ఉన్నత స్థాయి విద్యా మండలి చేసే విచారణకు తాము సిద్ధమేనని పేర్కొన్నారు. విద్యా మండలి విచారణకు తాము అన్ని రికార్డులను సిద్ధంగా ఉంచామని, అయితే ట్రస్ట్ పాలక వర్గాన్ని రద్దు చేసేందుకు ప్రత్యేక అధికారిని నియమించేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా మాత్రమే తాము ఉన్నత న్యాయ స్థానం నుంచి స్టే పొందామని కరస్పాండెంట్ వివరించారు. కోశాధికారి జాన శంకరరావు, సభ్యులు రుద్రరాజు పద్మరాజు, ప్రిన్సిపాల్ తోరం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు స్వచ్ఛతాహి సేవ అవార్డు


అవార్డు అందుకుంటున్న సర్పంచ్ తాతకాపు

మామిడికుదురు: స్వచ్ఛ భారత్ దివస్‌లో భాగంగా అమలాపురం కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు స్వచ్ఛతాహి సేవా సంకల్ప అవార్డును అందుకున్నారు. జేసీ నిషాంతి సర్పంచ్‌కు అవార్డు అందజేశారు. తాతకాపును శాలువాతో సత్కరించి, షీల్డును అందజేశారు. మగటపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి పట్టి లింగం కూడా ఈ అవార్డును అందుకున్నారు. అతనికి కూడా జేసీ అవార్డు అందజేశారు. అవార్డు అందుకున్న సర్పంచ్ తాతకాపు, కార్యదర్శి పట్టిలింగంను పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు సాయి వర్షిత



రావులపాలెం: గ్రామానికి చెందిన కర్రి సాయి వర్షిత ఇటీవల కాకినాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చదరంగం పోటీల్లో జిల్లా స్థాయిలో అండర్–17 విభాగంలో పాల్గొని ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. సాయి వర్షిత స్థానిక సిద్ధార్థ స్కూల్లో పదో తరగతి చదువుతుంది. త్వరలో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొంటుందని స్కూల్ యాజమాన్యం తెలిపింది. సాయివర్షితను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

క్లాప్ మిత్రలకు ఘన సన్మానం

అయినవిల్లి: గాంధీ జయంతి సందర్భంగా వీరవల్లిపాలెం సర్పంచ్ సలాది బుచ్చిరాజు అధ్యక్షతన బుధవారం వీరవల్లిపాలెంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ క్లాప్ మిత్రలకు శాలువా కప్పి, పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఉప సర్పంచ్ నగదును బహుమతిగా వారికి ఇచ్చారు. క్లాప్‌మిత్రల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా ర్యాలీలు

సఖినేటిపల్లి: మండలంలోని గొంది, అంతర్వేదికర గ్రామాల్లో బుధవారం గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలపై ర్యాలీలు నిర్వహించారు. గొందిలో సర్పంచ్ దొండపాటి రవికుమార్, ఏవో పీవీ నరసింహారావు, కార్యదర్శి ఎ.గంగరాజు, స్థానికులు పాల్గొన్నారు. అలాగే అంతర్వేదికరలో పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవకు అవార్డు


అవార్డు అందుకున్న సర్పంచ్ గంగా త్రివేణి

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడు గ్రామ సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల నిర్వహణగాను బుధవారం అవార్డు అందుకున్నారు. ఈ మేరకు అమలాపురం కలెక్టరేట్‌లో సర్పంచ్ గంగా త్రివేణి, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు చేతుల మీదుగా పై అవార్డు తీసుకున్నారు.